# కరుణాకర్ గిరుక్కున తిరిగి ఆ ఏడంతస్థుల మేడవైపు ఒక్కసారి చూసినాడు!

## కనుబొమ ముడిపడింది! ఆ తరువాత చేతిలోని సర్టిఫికెట్ల వైపు చూసిండు. కండ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగినాయి!

"ఛీ ఛీ! ఏం మనుష్యులో?...సంస్కారం లేని మనుష్యులు. కోట్లు బూట్లు తొడుక్కొని టైలు కట్టుకొని కుర్చీల నిండుకు కూర్చుంటే సరిపోతుందా? ఎదుటి మనిషిని ఇంటి పని మనిషిగా చూసే రోగి మనస్తత్వాలకు నకళ్ళు వాళ్ళు!....

ఒక అభ్యర్థిని ఇంటర్వ్యూ చెయ్యడానికి కూర్చున్న అభ్యర్థులా వాళ్ళు? మనది సెక్యూలర్ స్టేట్ కదా? మరి మన ముఖ్యమంత్రి కాషాయ వస్త్రాలెందుకు ధరిస్తున్నాడు? మన దేశాధ్యక్షుడికి గడ్డ మెందుకుంది? అశ్వమేధయాగం ప్రపంచ శాంతికి ఎంత వరకు దోహదం చేసింది? మొన్న మొన్ననే వరుణ జపం చేసినారు కదా? వర్షమెందుకు రాలేదు?

దీపావళి కథలపోటీలో రూ. 650/- బహుమతి పొందిన కథ

# ఖాండవ దహనం

ఇవేనా వాళ్ళడిగే ప్రశ్నలు! పోనీ! ఉద్యోగం యిచ్చేది వాళ్ళు కాబట్టి వాళ్ళ కిష్టమైనట్లు అడుగుతారు! అనుకొంటె ఈరోజుల్లో డూప్లికేటింగ్ మహా జోరుగా జరిగిపోతూ ఉంది కొంపదీసి యివన్నీ! అన్న సందేహాన్ని వ్యక్తం చేస్తూ నా సర్టిఫికేట్ల వైపు చూస్తూ ఆ ముగ్గురు మూర్ఖులు ఒకరి మొగం ఒకరు చూసుకొంటూ బాన కడుపులు బద్దలయ్యేటట్లు నవ్వుతారా?"

అర్ధగంటకు మునుపు ఆ ఏర్‌కండిషన్డ్ గదిలో బాన కడుపుల్ని మోస్తున్న కుర్చీలు అదిరి పడేటట్లు నవ్విన నవ్వులు చెవుల్ని తొలుస్తున్నాయి!

"నావి డూప్లికేట్ సర్టిఫికేట్లా? రాత్రింబవళ్ళు కంటికి వత్తేసుకొని కష్టపడి చదివి సంపాదించిన సర్టిఫికేట్లు డూప్లికేట్లా? వాళ్ళ తెలివి మండా? వాళ్ళకు నోరెట్లా ఆడిందో? పేదవాడి శ్రమకు విలువ లేదు పేదవాడి మాటకు నీతినిజాయితీలకు విలువలేదు పేదవాడి సర్టిఫికేట్లకు విలువలేదు ఉంటే నాకెందుకు ఉద్యోగం రాదు? రాలేదంటే యివన్నీ డూప్లికేట్లే!"

కరుణాకర్ మనస్సులో తిరుగుతున్న ఆలోచనలు అది ఒక ప్లాట్‌ఫారం అని, తానొక చదువుకొన్న యువకుడన్న తలంపుకే దూరం చేసినాయి

ఇవన్నీ డూప్లికేట్ సర్టిఫికేట్లు', అసలు నేనే ఒక డూప్లికేట్‌ని' అని కరుణాకర్ తనలో తాను గొణుక్కొన్నట్లున్నా మాటలు మాత్రం పదిమంది చెవుల్లో పడుతున్నాయి

ఆ ప్లాట్‌ఫారం మీద నడుస్తున్న జనం 'అయ్యో! పాపం! పిచ్చి పట్టినట్లుందే?' అని సానుభూతిగా చూస్తున్నారు కొంతమంది ఒక రకంగా చూస్తూ యింకొక రకంగా నవ్వుకొంటున్నారు

ఆ చూపుల్ని భరించలేక పోతున్నాడు కరుణాకర్ బాన కడుపుల నవ్వులు చెవుల్లో జోరిగలైనాయి గుండు చెంబు తలకాయల మాటలు బొడ్డులో కుమ్మరిపురుగులైనాయి

మంచి గొడ్డుకు ఒక్కదెబ్బ! మంచి మనిషికి ఒక్కమాట!'

కరుణాకర్ అరికాలిమంట ఉచ్చికెక్కింది

ఇవన్నీ డూప్లికేట్లే! అని అరుస్తూ చేతిలోని సర్టిఫికెట్లను 'పర్' మని చించినాడు ఇరవైయేండ్ల కృషి ఫలితం ముక్కలై ఈ చేతిలో ఏడికెడు ఆ చేతిలో ఏడికెడుగా మిగిలింది ఆ రెండు ఏడికెళ్ళను పైకెత్తి పట్టి చూస్తూ పిచ్చిగా నవ్వుతున్నాడు కరుణాకర్! అతడు నవ్వుతున్నా – గుండెల్లో బాధ కండ్లల్లో చేరి ముత్యాలుగా మారి తన కృషి ఫలితాన్ని అభిషేకం చేయలేక నేలపాలవు తున్నాయి!

నవ్వుతూ ఏడుస్తూ, ఏడవలేక నవ్వుతూ అప్పటికేదో ప్రతీకార వాంఛ తీరినట్లుగా చేతిలోని కాగితం ముక్కల్ని పిచ్చిగా చూస్తూ అటుపై ఆ ముక్కల్ని గాలిలోకి విసిరికొట్టాడు

ఆ ముక్కలు గాలివాటంగా పరుగిడుతున్నాయి బడి విడిచిన పిల్లల్లాగా! వాటి వెంట పరుగిడుతున్నాడొక కుర్రవాడు బడిపిల్లల వెంటపడిన పచ్చోడిలాగా!

కరుణాకర్ దృష్టి ఆ కుర్రవాడి మీద పడింది.

పొట్టి నిక్కరు 'సగం వొంటిని కూడా చాల చాలని చొక్కా నల్లని కాగితాల ముక్కలు ముక్కలుగా చింపి నెత్తికతికించినట్టు గూడు కట్టుకున్న తల ఆ బాట మీద తేస్తున్న మురికంతా వాడి వొంటిమీదనే కాపురం పెట్టినట్లుంది వాడు గాలివాటంగా కాలికొచ్చి పరుగెత్తుతున్నాడు ఒక కాలికిందొక కాగితాన్ని, యింకొక కాలికిందొక కాగితాన్ని తొక్కి పట్టుకొంటున్నాడు అట్లానే వొంగి చేతో యింకొకకాగితాన్ని జవురు కొంటున్నాడు ఆ తరువాత నింపాదిగా నిలబడి కాళ్ళకింది కాగితాల్ని చేతికందుకొంటున్నాడు వీపు మీద గోనె సంచిని కిందికి దించి ఈ కాగితం ముక్కల్ని అందులో వేసుకొంటున్నాడు మళ్ళీ పరుగెత్తుతున్నాడు

నాలుగు కాగితాలు చేతికి దొరికి ఆ కాగితాల్ని వాడు సంచిలో వేసుకొంటున్నపుడు చూడాలి వాడి మొగంలో తృప్తి!-అది సటపట మైన తృప్తి కాదు దొంగల్ని తరిమి తరిమి పట్టుకొన్న పోలీసు మొగంలో విల్లివిరిసే తృప్తి!

చిత్తు కాగితాల్ని ఏరుకొంటున్న ఆ కుర్రవాడ తృప్తిని చూస్తుంటే- కరుణాకరకి చిత్రంగా ఉంది రెప్పార్పకుండా ఆ కుర్రవాడి వైపు చూస్తూనే ఉన్నాడు కాని ఆ కుర్రవాడు మాత్రం ఎవరివైపు చూడటం లేదు వాడి పని వాడిది!

ఈ ప్రపంచంలో ఇంత మంచి ఇన్ని విధాల బతుకుతూంటే నేనిన్నాళ్ళూ ఈ కాగితాల్ని చేత పట్టుకొని ఉద్యోగం! ఉద్యోగం అంటూ కాళ్ళరిగేట్టు తిరిగినానే!

కరుణాకరకి ఏదో జ్ఞానోదయం కలిగినట్లయింది

ఇరవై యేండ్లు పాటుపడి సంపాదించిన యోగ్యతా పత్రాలు తనకు పనికి రాకపోయినా ఆ కుర్రవాడి కిచ్చిన తృప్తిని తలుచుకొంటే ఎంతో ఆనందంగా ఉంది

అతడు నవ్వుతున్నాడు! - తృప్తిగా నవ్వుతున్నాడు!!

భవిష్యత్తులో వెలుగు రేఖా మాత్రంగా



గోచరిస్తూంటె – ఉంచుకోవడాని కన్నట్లుగా ఆనందంగా నడుస్తున్నారు!

ఆ మహాపట్నం శివార్లలో శ్రీవేంకటేశ్వరా కాటన్ మిల్సు గిడ్డంగులు. ఆ గిడ్డంగుల ప్రక్కనే గాదె పక్కకొదిగిన కోడిపెట్టల్లా పూరిగుడిసెలు ఆ గుడిసెల్లో ఒకానొక గుడిసెలో ఒక ముసలి ప్రాణి ఉండూర్లోనే ఏదో ఉద్యోగం వస్తుందని వెళ్ళిన కొడుకు ఎప్పుడొస్తాడో? వస్తూ వస్తూ ఏం కబురు తెస్తాడో? అని ఎదురు చూస్తూ ఉంది

నడక పరుగ్గా వచ్చిన కరుణాకర్ గడపలో అడుగు పెట్టాడు తల్లి కంట పడింది ఆమెను చూస్తూనే – 'అమ్మా! నాకు ఉద్యోగం వచ్చిందమ్మా!" అంటూ అరిచినాడు గుడిసింటి పైకప్పు ఎగిరి పోయేటట్లు అరిచినాడు

ఆ మాట చెవిని పడేసరికి ఆ పూట ఉదయం పడిన కష్టమంతా ఎటు పొయ్యిందో? ఏమో? – ఆ ముసలి ప్రాణికి వెయ్యేనుగుల బలం వచ్చినట్లయింది "అవునా! నాయనా!' అంటూ అమాంతంగా కరుణాకర్‌ని గుండెల కదుముకొనింది ఇన్ని సదువులు సదివిన నా బిడ్డకే రాకపోతే యింకెవరికొస్తుంది ఉద్యోగం' దేముడు నా మొరాలకించినాడు అంటూ ఆ తల్లి ఆనందంతో పరవశించి పోతుంటే కరుణాకర్ గుండెలు వెళ్ళగక్కలేని బాధతో విలవిలలాడుతున్నాయి ఉద్యోగం రాలేదని చెప్పలేదు వచ్చిన 'ఉద్యోగం ఫలానా అని చెప్పలేదు ఆ నిస్సహాయతతో

# ఖాండవదహనం

**నలుగుతున్న గుండెలు కరిగి నరవుతున్నాయి కన్నుల నుండి పైకుబుకుతున్నాయి**

లేగదూడకు పాలిస్తూ ఆప్యాయంగా దాని వొళ్ళు నాకుతున్న ఆవులా – కరుణాకర్‌ని గుండెల్లో పొదివికొని తల నిమురుతున్న తల్లి ఉన్నట్టుండి ఉలిక్కిపడింది –చల్లని గుండెల మీద వెచ్చని తడి తగిలేసరికి!

అంతే! రెండు చేతుల్తో తలను పొదివి పట్టుకొని పైకెత్తింది

"కండ్లల్లో ఏకధారగా కన్నీళ్ళు!

"యాడుస్తా వుండావా? ఎందుకు నాయనా? మన కష్టాలీరినయాళలో కండ్లల్లో నీళ్ళా? ఎందుకయ్యా? ఏం జరిగిందో చెప్పయ్యా!'

ఆ తల్లి మాటల్లో ఆతురత ఆర్ద్రత పెనవేసుకొన్నాయి

ఏమని చెబుతాడు? చెప్పి తన మీద, తాను చదివిన చదువు మీద కొండంత ఆశలు పెట్టుకొన్న తల్లి గుండెల్ని ముక్కలు ముక్కలు చేయగలడా? అందుకే ఎటూ తోచక ఆ తల్లి గుండెల్లోనే తలదాచుకొని బావురుమన్నాడు.

అయోమయ స్థితిలో ఆ తల్లి గుండె విలవిల లాడింది

కరుణాకర్ ఏడుపు ఎక్కిళ్ళుగా మారి ఆ ఎద మీద ఎగిరెగిరి పడ్తూ ఉంది

ఎట్లా సహించ కలుగుతుందా తల్లి? – అందుకే బిడ్డ తలను రెండు చేతులతో పట్టుకొని మొగాన్ని పైకి లేపింది ఏకధారగా కారుతున్న కన్నీళ్ళను చూసేసరికి గుండె కలుక్కుమనింది. కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగినాయి ఒక చేత్తో బిడ్డ కారుస్తున్న కన్నీళ్ళను తుడుస్తూ 'చెప్పు నాయనా! చెప్పు ఎందుకీ కన్నీళ్ళో చెప్పరా!' అని అడుగుతూ ఉంది అయితే 'ఎందుకీ కన్నీళ్ళని!' అడుగుతూ తాను కన్నీళ్ళు కారుస్తున్న సంగతి మరిచి-పోయింది.

కన్న పేగు కారుస్తున్న కన్నీళ్ళు కరుణాకర్ కంట పడింది.


తల్లి కంట తడిని సహించలేక తన్ను తాను సమాధాన పరుచుకొన్నాడు


'అమ్మా! నేనేడవడం లేదమ్మా! . నిజంవమ్మా! నేనెందు కేడుస్తాను? ఇవి కన్నీళ్ళు కాదమ్మా! ఆనందభాష్పాలు! ఉద్యోగం వచ్చిందన్న ఆనందంలో ఆనందభాష్పాలమ్మా!'


ఆ మాటల్ని నమ్మాల్నో లేదో తెలియకుండా ఆ పిచ్చితల్లి కొడుకు వైపు వెర్రిగా చూస్తూ ఉంది

"ఏంవమ్మా? ఎందు కట్లా చూస్తున్నావ్? నా మాట మీద నమ్మకం లేదా?"

"ఎంత మాటింత మాటరా తండ్రీ! గొంతు కోసినా తప్పు పలకని నా బిడ్డ మాటే నేను నమ్మక-పోవడవా?'





ఈ మాట సమ్మెట దెబ్బలా సూటిగా కరుణాకర్ గుండెలకే తగిలింది అయినా తానేమీ తప్పు చెప్పడం లేదు కదా? అని నిబ్బరించుకొన్నాడు

అమ్మా! నువ్వే చూస్తావుగా! ఈ వేళ సాయంకాలమే డ్యూటీలో చేర్తానమ్మా!'' అంటూ తల్లి చేతుల్ని మెల్లగా విడిపించుకొన్నాడు లేని నవ్వు మొగాన పులుముకొని హుషారుగా ముందుకు నడిచినాడు ఆ గుడిసెలో నులక మంచం కింద చెక్కపెట్టె ఆ పెట్టెను తెరిచి రెండు పాత ప్యాంట్లను తీసుకొన్నాడు ఒక పాత కాగితంలో చుట్టుకొన్నాడు ఒక్కసారి మళ్ళ తల్లి వైపు చూసినాడు

ఆమె కన్నార్పకుండా తన వైపు చూస్తూనే ఉంది

'ఏంవమ్మా? ఎందుకట్లా చూస్తున్నావే? నేను చెప్పేది అబద్ధమనుకొన్నావా? లేదమ్మా! లేదు నువ్వేమీ యింక దిగులు పడద్దమ్మా! ఇంక మీద నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తానమ్మా!' అంటూనే గబగబ బయటికి నడిచినాడు

ఆయనే బతికుంటే నా బిడ్డకిన్ని తిప్పలా? అదేదో ఆయనే పడేవోడు ఇప్పుడట్లాకాకపాయ అయినదానికి కానిదానికి అన్నిటకీ నా బిడ్డ పడరానిపాట్లు పడ్తా వుంటే – కడుపు తరక్క పోతా వుండాది అయినా నేనేం చెయ్యగల్ను? ఊరికి ఉత్తరం దక్షిణం తెలవని ముదనష్టపుదాన్ని అన్నిటికీ ఆ బగవంతుడే ఉండాడు!' అని ఆ తల్లి కొడుకు వెళ్ళిన వైపే చూస్తూ ఆలోచిస్తూంటే చెవులు చిల్లులుపడేటట్లు మిల్లులో సైరన్ కూసింది!

"అయ్యో! అప్పుడే గెంట పన్నెండైపొయ్యిందే! ఇయ్యరవదాకా పొయ్యట్లా రాజెయ్య లేదు పొద్దుతో గూడ లేసి పొయ్యిన బిడ్డ ఏం తిన్నాడో? ఏంవో? పాపం! వాడొచ్చేకుంది కంత ఉడక బెట్టియ్యకపోతే ఎట్లా?' అనుకొంటూ లేచి ఆమె వంట ప్రయత్నంలో పడింది

పొద్దు తిరుగుతున్న వేళలో పొట్లం ఒకటి చేత పట్టుకొని కరుణాకర్ ఆడుతూ పాడుతూ ఆనందంగా వచ్చినాడు ఆ పొట్లాన్ని చెక్కపెట్టెలో పెట్టి వచ్చి కూర్చున్నాడు

తల్లి ఎదురుగా బిడ్డ బిడ్డ ఎదురుగా తల్లి ఒకరి ఎదురుగా ఒకరు కూర్చుని తృప్తిగా తిన్నారు

సెకండ్లు నిముషాలై నిముషాలు గంటలై కలబడి ఆటగాళ్ళలా సూర్యుణ్ణి బంతిని తన్నినట్లు తన్నుతూంటే గోల్ వైపు పరుగెడుతున్న బంతిలా సూర్యుడు పడమటి దిశకు జారుకొంటున్నాడు

పొద్దు గూట్లో పడింది

గుడిసింటి నట్టింట గూట్లో దీపం వెలిగింది

కరుణాకర్ కాళ్ళుచేతులు కడుక్కొన్నాడు మంచం కింద చెక్క పెట్టెను తెరిచి పొట్లాన్ని చేతికెత్తుకొని విప్పినాడు

అందులో రెండు నిక్కర్లు!

తాను తొడుక్కొంటున్న రెండు పాత ప్యాంట్లను కత్తిరించి కుట్టించుకొన్న నిక్కర్లు ఒక నిక్కరు చేతికందుకొన్నాడు అట్లాగే కాసేపు పరీక్షగా దాని వైపు చూస్తుంటే మనస్సు ఒక్కసారిగా వెనక్కు వెళ్ళింది

ఆ రోజు! నిక్కర్లను వదిలేసిన రోజు! ప్యాంటు తొడుక్కొని కాలేజికి వెళ్ళుతున్నామని సంబర పడిన రోజు!

ఈ రోజు! వదిలేసిన నిక్కర్లని మళ్ళ తొడుక్కొంటున్న రోజు!

అంటే? – బ్రదుకు మళ్ళ ఆ రోజు నుండే ప్రారంభమవుతూ ఉందన్న మాట! ఈ మధ్యకాలంలో చదివిన చదువులు, గడిచిన జీవితం అంతా వృదా అయిపోయిందన్న మాట! ఈ పని ఆ రోజే చేసి ఉంటే? –

గుండెల్లో వ్యధ! – పెదవులపై చిరునవ్వు!"

కరుణాకర్ గబగబ ఆ నిక్కర్ని తొడుక్కొన్నాడు ఒకసారి తనకు తానే కిందికి పైకి మార్చి మార్చి చూసుకొని తృప్తిగా నవ్వుకొన్నాడు ఆ తరువాత తానెంతో అపురూపంగా చూసుకొంటున్న ఒక పుస్తకాన్ని చేతికందుకొన్నాడు అయిదారు పేజిల్ని కసిదీరా విడివిడిగా చింపినాడు 'అమ్మా! ఈ కాగితాల్ని చేత పట్టుకో! అమ్మా!' అంటూ తల్లి చేతికిచ్చినాడు

ఆ తల్లికి అంతా అయోమయంగా ఉంది కాగితాల్ని చేతపట్టుకొని కన్నార్పకుండా కొడుకు వైపు చూస్తూ ఉంది

కరుణాకర్ ఒక గోనె సంచిని చేతికందుకొన్నాడు తల్లి దగ్గరికి చేరి 'అమ్మా! ఆ కాగితాల్ని అట్లా వాకిట్లోకి పారేయమ్మా! అన్నాడు

ఆమె పారేసింది

ఆ కాగితాలు గుడిసింటి ముందర గాలికి పరుగెడుతున్నాయి – గద్దను చూసిన కోడి పిల్లల మాదిర

కరుణాకర్ ఒక్క ఊపులో బయటికి దూకినాడు ఆ కాగితాల వెంటపడి పట్టుకొన్నాడు గోతంలో వేసుకొన్నాడు నేరుగా తిరిగి వచ్చి వంగి తల్లి పాదాలకు నమస్కరిస్తూ 'నన్ను ఆశీర్వదించమ్మా!' అన్నాడు

ఆ తల్లి బోరుమని ఏడుస్తూ కుప్పగా కూలిపోయింది

కరుణాకర్ గోనె సంచిని భుజాన వేసుకుని ముందుకు నడుస్తున్నాడు తిరిగి చూడకుండా ముందుకు నడుస్తున్నాడు

చుట్టు గుడిసెలో ఆ ముసలిదాని ఏడుపు సుళ్ళు తిరుగుతూ ఉంది

బయల్దేరడమైతే కరుణాకర్ మహా జోరు మీద బయల్దేరినాడు తన ధ్యేయాన్ని సాధించి తన ఈడు వాళ్ళకు తానొక ఆదర్శంగా నిలబడాలన్న పట్టుదలతో బయల్దేర్నాడు అందుకే పొట్టి నిక్కరుతో, మాసిన చొక్కాతో వీపున గోతంతో రాజాలా నడుస్తున్నాడు

రాజాలా నడుస్తున్న కరుణాకర్ 'ఠక్!' మని ఆగి పోయినాడు ఎదురుగా రాచబాట! –నల్లని ఆ తారురోడ్డు తన దారి కడ్డంగా పడుకొన్న నల్లత్రాచులా కనిపిస్తూ ఉంది

కాళ్ళు నిలబడినా మనసు నిలకడగా లేదు దాని

వారి దారిది!

ఈ బాటమీద తెలిసిన మొగా లెదురైతే? కొంపదీసి స్నేహితులే పలకరిస్తే! ఛాఛా! ఎందు కింత తొందర పడినాను ఇప్పుడు మాత్రం ఏం కొంపలు మునిగి పోతున్నాయ్? తిరిగి వెళ్ళిపోతే? వెళ్ళి అమ్మకు మొగ పెట్లా చూపించేది? చూపితేయేం? ఆ తల్లి యింకా సంతోషిస్తుంది! – అయినా యిదేమిటి ఎరికి తనం? దొంగతనం చేస్తున్నానా? ద్రోహం తలపెడుతున్నానా? కష్ట పడ్తాను నా కాళ్ళమీద నేను నిలబడ్తాను మొదట మొదట బెరుకు బెరుగ్గానే ఉంటుంది అలవాటైతే అంతా సరిపడ పోతుంది కరుణాకర్ మనస్సు రకరకాలుగా ఆలోచిస్తూ ఉంది

అంతలోనే నాలుగైదు చిత్తు కాగితాలు పెద్ద పెద్ద కాగితాలు! ఏ చేతి నుండి జారిపడినాయో? ఏమో? గాలిక కొట్టు కొంటు పోతున్నాయ్ తన ప్రక్కనే పోతూ కంట పడినాయి అప్రయత్నంగానే వంగి జపురుకొన్నాడు

ఆలోచనల్ని పుటుక్కున తెగినాయి తెగిన ఆలోచనల్ని చేతికందిన చిత్తు కాగితాల్ని కలగలిపి సంచిలో వేసుకొన్నాడు మనస్సు నిమ్మళించింది

ఇప్పుడు కరుణాకర్ దర్జాగా నడుస్తున్నాడు!

వీధి దీపాలు వెంట పడి తరుముతూంటే చీకట ఆ మహాపట్టణంలో సందు గొందుల్లో, శివార్లల్లో చేరి చిక్కపడ్తూ ఉంది కరుణాకర్ అట్లాంటివే అనువైన స్థలాలనుకొన్నాడు వంచిన తలెత్తనట్లే నడుస్తూ చుట్టూ గమనిస్తూ ఊరి శివార్లను చేరుకొన్నాడు అయినా మనసు బిక్కు బిక్కు మంటూనే ఉంది అక్కడ కూడా తెలిసిన మొగ మెదైనా కంట పడుతుందేమో? అని ఒక కంట గమనిస్తూనే కంటపడిన చిత్తు కాగితాల్ని ఏరుకొంటున్నాడు

పల్లె కొంపల్లో అయితే ఏమ చిటుక్కుమంటే ఊరూ నాడు ఒక్కటై పోతుంది మహాపట్నాల్లో ఏముంది? ఎవరి బ్రతుకు వాళ్ళది ఎవరి దారి వాళ్ళది

ఆ పూట కరుణాకర్ దారిక ఎవ్వరూ అడ్డు రాలేదు

నిండిన గోతాన్ని వీపున మోసుకొని కరుణాకర్ యిల్లు చేరేసరికి రాత్రి పదకొండు గంట లయింది గోతాన్ని గుడిసెంట గోడకు నిలవేసి లోనికి తొంగి చూసినాడు

నట్టింట గూట్లో దీపం నిశ్చలంగా మండుతూ ఉంది గోడకు చేరగిలబడిన తల్లి నిరామయంగా శూన్యంలోకి చూస్తూ ఉంది కారిన కన్నీళ్ళు కర్ర కట్టాయి!

కరుణాకర్ గుండెల్లో కెలిక నట్లయింది అడుగుమీద అడుగ్గా నడిచి అమ్మ ముందు తలవంచుకొని నిలబడినాడు ఆమె పట్టించుకొనే స్థితిలో లేదు కంటపడ్తే కావిలించుకొనే తల్లి కన్నెత్తి చూడకపోవడం ఆ లేత గుండెల్ని కోత కోసినట్లయింది తట్టుకోలేక అమ్మా! అని ఎలిచినాడు

# మంచి వెలుగులు

సంచడుగా దీపావళి
సంబరాల సంరంభం
బాణా సంచాల లోన
జన జీవన సారూప్యం!

పసి ఎల్లల కేరింతలు
సంభ్రమాల విన్యాసం
కన్నెల చిరు చిరు నవ్వులు
వెన్న మతాబుల పువ్వులు

అల్లుడి ఆశల ఎత్తులు
తారాజువ్వల విరులు
వినాయకుల వాగ్దానపు
అగాధాల విలాపన

చోటా నాయకుల ప్రతిభ
తాటాకు టపాకాయలు
పార్టీలో విబేధాలు
నేమ టపాకాయలు

ఆయారాం గయారాంల
మార్పిడి కప్పల గంతులు
ఒక్కసారి ప్రేలగనె
చిచ్చుబుడ్ల దాచ్చయాలు

వేడుక పెరిట పంచల
రూపాయిల ప్రదాఖర్చు
మధ్యతరగతి కుటుంబాల
వేడుకలో వేదన!

బాహ్యతిమిరంబును బాపి
దీపమ్ముల వరుసలిల
మనస్సు మీర నాశకమగు
మంచితనం వెలిగింతుము!

—లతిక

# ఖాండవదహనం

ఆ తల్లి ఉన్నట్లుండి ఒక చూపు చూసింది!

ఎన్ని అర్థాలో ఆ చూపులో?

కరుణాకర్ గిల గిల లాడినాడు అయినా నిబ్బరించుకొని 'అమ్మా! అంత అన్నం పెట్టమ్మా!' అన్నాడు ప్రాధేయపూర్వకంగా

'ఛీ! నేన్ని కమ్మనూగాదూ! నువ్వు నాకు బిడ్డవూకావు ఫో దూరంగా!'

'నీ కంటికి దూరంగా పోవాల్సినంత తప్పేమని నేనేం చేసినానమ్మా!'

'నువ్వేం తప్పు చేసినావు తండ్రి! తప్పంతా నాదే! నిన్ను కడుపున మోసి కనిందొక తప్పు నా చావు నన్ను చావమని ఆయనేవో లచ్చిణంగా ఎలబారిపోతే యింటింటా శాకిర్చేసి నిన్ను సదివించిం దింకొక తప్పు నా కంటి కెదురుగా నువ్వు సిత్తు కాగితా లేరుకొన్నానుపోతే నేనింకా బతికుండానే అది అన్నిటికన్నా తప్పు!'

అమ్మా! గుండెలు పగిలేటట్లు అరిచినాడు కరుణాకర్ ఆ అరుపుల్లో బాధ ఆ తల్లి గుండెల్ని తాకితే ఆమె గొంతు మూగపోయింది

ఆ గుడిసెంటిలో మళ్ళీ రెండు క్షణాల నిశ్శబ్దం!

ఆ రెండు క్షణాల్లోనే కరుణాకర్ తెప్పరిల్లినాడు

'అమ్మా! నువ్వు నన్ను నీ చెమటతోనే చదివించినావు నేను చదువు కొన్నాను ఇంత బాగా చదివినవాడు యింకొకడు లేదన్నట్లుగా చదివినాను ఏం ప్రయోజనం? ఈ కాలంలో ఉద్యోగానికి అర్హతలు తెలివితేటలు మార్కులూ కాదమ్మా! డబ్బుండాలి లంచాలు కుమ్మరించాలి రెకమెండేషన్లయినా ఉండాలి ఇవేవీ లేకపోతే కులమైనా ఉండాలి ఏవీ లేనప్పుడు నన్నేం చెయ్యమంటావ్? చెప్పమ్మా? ఎన్ని పరీక్షలు? ఎన్ని ఇంటర్వ్యూలు? పరీక్షల్లో నెగ్గుతున్నా! ఇంటర్వ్యూల్లో రాలిపోతున్నా! నా మాట నమ్మమ్మా! నేను చదివిన చదువులు నువ్వు నమ్ము-కొన్న ఈ చదువులు మనబోటోళ్ళకు కూడు పెట్టవమ్మా!

"అయితే ఈ చిత్తుకాగితాలు కూడు పెట్తాయా నాయినా?"

"ఇప్పుడు కాకపోయినా ఒకనాటికి పెట్తాయి!"

"అప్పటికి నేనుండను

"అమ్మా! అసలే పుండు పడిన గుండెమీద కారం చల్లుతావెందుకమ్మా?

"ఆ పన్జేస్తున్నది నువ్వా? నేనా?

'అమ్మా! నన్నర్థం చేసుకోమ్మా! ఈ వయస్సులో నువ్వు కష్టపడి తెస్తుంటే తినేసి హాయిగా తిరగలేను. పోనీ! ఊరి మీద పడి అడుక్కు తిందాంవంటే–'సిగ్గెలేదురా చెటు! గూటం మాదిరుండావే? ఏదైనా పనిచేసుకొని బతకరాదా?' అని దెప్పి దెప్పి పొడస్తారు చదువుకు తగిన ఉద్యోగమా? రాదు ఏదో ఒకటి చేద్దాంవంటే యిచ్చేవాళ్ళు లేరు కడకే టీ కొట్టులోనో, కిరాణా కొట్టు లోనో పని చేద్దామంటే–! ఈ చదువు కున్నోళ్ళను నమ్మిన వాళ్ళెవరు? ఎంత డిపాజిట్టు కట్తావు?' అంటారు. ఇంకేం చెయ్యమంటావమ్మా? పెట్టుబడి లేకుండా చెయ్యగలిగిన వ్యాపారం యిదొక్కటే!– బాగా ఆలోచించే ఈ నిర్ణయాని కొచ్చినాను. 'ఈ పని కూడ చెయ్యొద్దు!' అంటే – యింక చేయ్యగలిగిన పని ఒక్కటే!. .. అంత విషం తిని చావడం!'

"నాయినా!" అంటూ ఆ తల్లి అమాంతంగా పైకి లేచి బిడ్డను గుండెల కదుముకొనింది.

బిడ్డను చూసి తల్లి తల్లిని చూసి బిడ్డ . ఒకర్ని చూసి ఒకరు ఏడుస్తున్నారు. ఎంతసేపు ఏడ్చినా ఎవరున్నారు ఓదార్చడానికి?––

కాలం బరువుగా సాగిపోతుంది.

ఇక తప్పదన్నట్టుగా ఎవరి బాధను వాళ్ళు దిగమింగినారు. ఒక బాధ తీరే మనిషికి యింకొక బాధ. అనడి జాములో అయిష్టంగానే అంత ఎంగిలి పడినారు. ఎవరి దారిన వాళ్ళు వెళ్ళి పడుకున్నారు

ఆ రాత్రి అట్లా గడిచి పోయింది.

ఆ తరువాత ప్రతిరాత్రీ కరుణాకర్ ఊరి మీద పడుతున్నాడు దాదాపు అర్ధరాత్రి వరకు తిరగని చోటు లేదన్నట్టుగా తిరిగి చిత్తు కాగితాల్ని సేకరిస్తున్నాడు. అట్లా సేకరిస్తూంటే ఎన్ని అనుభవాలో?–

ఒక రోజు రాత్రి దాదాపు అర్ధరాత్రి కావస్తూ ఉంది. మూట నిండడానికింకా కాసిన్ని కాగితాలు తక్కువగా ఉంటే తిరుగుతున్నాడు. ఒకా నొక నాలుగు రోడ్ల కూడలిలో రాజకీయ నాయకుడి పొట్టలా ఉబ్బిన ఒక కుప్ప తొట్టి కంట పడింది దుర్వాసన ముక్కుపుటాల్నదర కొడ్తూ ఉంది. అయినా భరించి తొట్టి మీదికి వంగి కాగితాల్నేరు కొంటున్నాడు అంతలోనే వట్టి కాలి మీద ఒక దెబ్బ 'ఫతీ' మని పడింది. గబుక్కున వెనక్కు తిరిగి చూస్తే గాడిద ! వెనుక్కాళ్ళతో ఒళ్ళు తన్ను తన్ని ఓంగ్రిస్తూ ఉంది.

"ఒరే చదువు కొన్న గాడిదా! ఇదేం పనిరా? చదివినంత చదువు చదివి కడకు గాడిద కూడు కుడుస్తున్నావు కదరా? ఇదేనా నీ సంస్కారం?" అని అడిగినట్టుందా ఓండ్రింత.

కరుణాకర్ వేదాంతిలా ఒక చిరు నవ్వు నవ్వి దానికొక నమస్కారం కూడా పెట్టి ముందుకు కదిలాడు.

ఇంకొకరోజు రాత్రి గోనె సంచి భుజాన వేసుకొని దర్జాగా నడుస్తున్నాడు. గోడకంటించిన సినిమా వాల్ పోస్టర్. ఒక పక్క ఊడి గాలికి రెపరెపలాడుతూ ఉంది అప్పుడే కాక పోయినా మరి కాసేపటికి అది ఊడి నేల పడడం ఖాయం. అంతలావు సినిమా హీరోని నేల పడనీయడ మెందుకని కరుణాకర్ ఆ పోస్టర్ని లాగుతున్నాడు. 'ధం' అని వీపున ఒక పిడి గుద్దు పడింది. అదిరిపడి వెనక్కు తిరిగి చూస్తే తన ఈడు వాడే!

'ఏరా లోఫర్‌నా కొడకా? ఈ దేశంలో అభిమాన సంఘాలున్నాయను కొన్నావా? చచ్చినాయను కొన్నావా?" కోపంతో కొంకర్లు తిరిగి పోతున్నాడా భావి భారత పౌరుడు

కరుణాకర్ వంచిన తలెత్త లేదు

"ఏరా? చిత్తు కాగితాల వ్యాపారం వేనా? లేకుంటే వేళకాని వేళ ఈ సాకుతో కత్తిరించే వ్యాపారం వా? ప్రతి రాత్రి పోలీసు మొగుళ్ళ దెప్పుళ్ళు

అయినా కరుణాకర్ పట్టు వదలని విక్రమార్కుడే అయినాడు.

పదహేదు రోజులకు పది మూటలు సేకరించినాడు అమ్మితే కొంత డబ్బు వచ్చింది చెక్క పెట్టిలో భద్ర పరిచినాడు ఆ తరువాత పదహైదు రోజుల్లో పదహైదు మూటలు సేకరించాడు అమ్మినాడు ఈ డబ్బు ఆ డబ్బు కలిపినాడు

నాలుగు డబ్బులు చేతికొస్తే నలభై రకాల ఆలోచనలు మనిషికి!

'ఇంటింటికి తిరిగి న్యూస్ పేపర్ ఎందుకు కొన కూడదు? అనుకొన్నాడు అంతే! ప్యాంటు షర్టు తొడిగి జాడుగ సైకలెక్కినాడు. పగటి పూట వీధి వీధి తిరిగి న్యూస్ పేపర్ కొనడం, రాత్రి పూట చిత్తు కాగితాలు సేకరించడం!"–

"చిత్తు కాగితాల వ్యాపారం కొత్త ఊపిరి పోసింది కరుణాకర్‌కి!

ఇప్పుడు కరుణాకర్ ఒక కొత్త సైకిలు కొనుక్కొన్నాడు. ఒక కుర్రవాడిని పనికి కుదుర్చు కొన్నాడు ఆ కుర్ర వాడు వీధులు తిరిగి న్యూస్ పేపరు కొంటుంటే తాను ప్రింటింగ్ ప్రెస్సుల్లో కటింగ్ జల్లి కొంటున్నాడు

కరుణాకర్ శ్రమకు పట్టుదల తోడయింది

ఆరు నెలలు తిరిగే సరికి గుడిసింటి ముందర లారి భర్తీ అవుతూ ఉంది.

"అయ్యో పాపం !" అన్న వాళ్ళే ' ఆహా! ఓహో! ' అంటున్నారు

'వాడి కేదో పిచ్చి పట్టింది ' అన్న వాళ్ళే తెగ మెచ్చుకొంటున్నారు

కరుణాకర్ తల్లికి ఒక ప్రక్క ఆనందంగా ఉన్నా ఇంకొక పక్క చదువు కున్న బిడ్డ ఉద్యోగం చెయ్యకుండా ఏందో ఈ చిల్లరాట్లు?' అని అసంతృప్తి గానే ఉంది


అయినా కరుణాకర్ ఇదంతా గమనించే స్థితిలో లేడు. అతని కిప్పుడు క్షణం తీరిక చిక్కడం లేదు ఒకటి రెండు సార్లు తల్లి దగ్గర కూర్చుని ఆమెను చాకిరి నుండి విముక్తురాల్ని చేయాలని సతపోర్తినాడు కానీ! కాలాడేదాకా ఈ బతుకులో చెయ్యాడాల్సిందే!' అని ఆమె మొండి పట్టు పట్టడంతో ఆ ప్రయత్నాన్ని విరమించు కొన్నాడు


వ్యాపారం బాగా పెరిగింది. ఇప్పుడతని దగ్గర అయిదారు మంది కుర్రాళ్ళు పని చేస్తున్నారు. ఆ కుర్రవాళ్ళు తెచ్చిన పాత న్యూస్ పేపర్ని, చిత్తు కాగితాల్ని, కటింగ్ జల్లిని తూకాలు వేసుకోవడం..... వాళ్ళకు పైసలిచ్చి పంపడం... మళ్ళీ ఆచిత్తును బస్తాల్లో భర్తీ చేయించడం... తూకాలు వేయించడం . ఆ తూకాల్ని ఆయా బస్తాల మీద సిరాతో మార్కు చేయించడం– ఈ పనులన్నీ చేస్తున్న కూలీలకు కూలీలు బట్వాడా చేయడం- 'కార్య వాదికి కార్యం మీదనే కన్ను!' అన్నట్టుగా వ్యవహరిస్తున్నాడు

నాలుగు డబ్బులు చేతికి మిగులు తూంటే కాలం గడిచినట్లు తెలియడం లేదు

ఒకరోజు మధ్యాహ్నం, కరుణాకర్ కాగితాల్ని తూకం వేయిస్తున్నాడు అప్పుడతని దృష్టి ఒక కాగితం మీద పడింది ఆ కాగితంలో ఒక ప్రకటన ఆ ప్రకటన వైపే చూస్తూ చాలా సేపు ఆలోచించినాడు కరుణాకర్. ఒక్క సారిగా నాలుగైదు మెట్లు పై కెక్కడానికి అదే మార్గంగా తోచింది. తల తాకట్టు పెట్టి అయినా అందులో దిగవలసిందే! అనుకొన్నాడు.

కాటన్ మిల్లులో 'వేస్ట్' తాలూకు బహిరంగ వేలం



ప్రకటన అది ఆ వేలానికి దాదాపు యిరవై రోజులు వ్యవధి ఉంది అయితే డిపాజిట్టు మాత్రం రెండు రోజుల్లోపలే చెల్లించాలి

కరుణాకర్ చేస్తున్న పనిని విడిచి పెట్టి నేరుగా బ్యాంకుకు వెళ్ళినాడు బ్యాంకు మేనేజర్ని కలుసుకొన్నాడు, పరిస్థితిని వివరించి చెప్పినాడు ఒక వేళ పాటదారుడు తానైతే ఆ 'స్వాక్స్' మీద అప్పు మంజూరు చేయమని అభ్యర్థించినాడు

మేనేజర్ ఒక్కక్షణం ఆలోచించినాడు

'చూడు కరుణాకర్! నువ్వు ఈ బ్యాంకులో అక్కౌంట్ ప్రారంభించి నప్పటి నుండి నిన్ను గమనిస్తున్నా ముఖస్తుతి కాదు కానీ చదువు కొన్నప్రతి విద్యార్థి నిన్ను ఆదర్శంగా తీసుకొంటే- దేశంలో నిరుద్యోగ సమస్య ఏమవుతుంది? తోక ముడుచుకొని పారిపోతుంది ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి కావాల్సింది నీలాంటి వాళ్ళే బాబూ!- ప్రొసీడ్!- నా సహాయం ఎప్పుడూ నీకు తప్పకుండా ఉంటుంది అంటూ మేనేజర్ అభయ మిచ్చాడు

కరుణాకర్ ఆనందానికి అవధులు లేవు,

ఆ బ్యాంకులో అంత వరకు తాను దాచుకొన్న డబ్బును డ్రా-చేసుకొన్నాడు నేరుగా కాటన్ మిల్స్‌కు వెళ్ళినాడు కాటన్ మిల్స్ నిబంధనల మేరకు ధరావత్తు చెల్లించినాడు తృప్తిగా యిల్లు చేర్నాడు అయితే ఆ తరువాత వాళ్ళా చేతులు పెట్టుకుని కూర్చోకుండా ఒక్క కిలో వేస్ట్ మార్కెట్ వెల ఎంత? దాన్ని శుభ్ర పరచ డానికెంత ఖర్చవుతుంది? అన్న వివరాలు సేకరించినాడు కిలో మీద తన కెంత కిట్టుబాటుండాలో నిర్ణయించు కొన్నాడు ఆ ప్రకారమైతే తాను వేలం పాట ఎంత వరకు పాడవచ్చో నిర్ణయించు కొన్నాడు ఆ రోజు కోసం నిరీక్షిస్తున్నాడు

ఇది రాతి యుగంకాదు రాకెట్ యుగం ఇరవై రోజులు గడవడం ఎంతసేపు?

ఆ రోజు రానే వచ్చింది

అనుకోని విధంగా కరుణాకర్ వేలం పాట దారుడు కావడం కూడా జరిగిపోయింది

కరుణాకర్ అగ్రిమెంటులో సంతకాలు పెట్టాడు అటునుండి అటె బ్యాంకుకు వెళ్ళి మేనేజర్కి విషయాన్ని తెలిపినాడు నెలరోజుల్లో స్వాక్స్ క్లియర్ చేయాల్సిన సంగతి కూడా వివరించినాడు మేనేజర్ నిజంగా సంతోషించినాడు యోగ్యుడు తెలివిమంతుడైన పేద యువకుడికి సహాయం చేస్తున్నామన్న ఆనందంతో బాబూ! ఈ రోజే అనుమతి కోసం హెడ్డాఫీసుకు రాస్తున్నా వారం పది రోజుల లోపుగానే తప్పకుండా అనుమతి లభిస్తుంది ఆ మీదట నువ్వు ఎప్పుడైనా వచ్చి డబ్బు తీసుకోవచ్చు బాబూ! అంటూ అభినందించినాడు

కరుణాకర్ ఆనందలహరిలో తేలిపోతున్నాడు గాలిలో తేలిపోతున్న 'కాళ్ళను నిలదొక్కుకుని ఊహల్లో ... కుల పరుగుల మీద ఉన్న మన

# దీపహాసము

అధిక తృష నిదాఘాన నలమటంచు
నిలకు నమృతంపు వర్షధారలను తృప్త
సంఘటించిన జగతి కొసంగు వరము
నాగ పైరు పచ్చల శోభ లలముకొనియె

జాతి సకలమ్ము నతులితాజ్ఞాన తిమిర
జాలములు క్రమ్ము వేళ విజ్ఞాన కరణ
ములను పోలె జగత్తును ముంచు చక
టులను తొలగించు దీపాల కళికలలమె

బ్రహ్మమును లిచ్చు ప్రేమ మార్గమును విడచి
కర్మ భూమిని కన్నీటి కాల్వ చేయ
భరతమాత కాటుక కంట వరద నరు
ముంచెనన నంధకారమ్ము ముంచె జగతి

అతుల ధవళకాంతి నలరారు తారకల్
మాకు సాటి యౌనె మహాతదివ్య
నను చు దీపరాజి యతిమాత్ర కాంతితో
నాక్రమించె ననగ అవని యొప్పె

రెల్లుపూ నెపమ్మున నవ్వె పృథ్వికాంత
తేరిన ప్రవాహ సుగతి నదికుమారి
పరువు లెత్తె; వినిర్మల వారిదముల
తూగుటుయ్యెల జాబిల్లి యూగదొడగె

– మొవ్వ వృషాద్రిపతి

# ఖాండవదహనం

స్సును స్వాధీనానిక తెచ్చుకొని గాలిలో తేలి వచ్చినట్లుగా యిల్లు చేర్నాడు

ఆ రోజు నుండి కరుణాకర్ కూర్చున్నా పడుకొన్నా తల నిండుకు ఆలోచనలే' వేలం పాటలో కొన్న వేస్ట్ మీద ఆలోచనలే' ఆలోచనలో ఆనందం ఇక ఖచ్చితంగా తన బ్రతుకు ఒక మలుపు తిరుగుతుందన్న ఆనందం'

కాలం పరుగిడుతూ ఉంది

వారం రోజుల తరువాత ఒకరోజు రాత్రి దాదాపు అర్ధరాత్రి కావస్తూ ఉంది అప్పటిక తర్తే

కరుణాకర్ వెళ్ళి పడుకొన్నాడు పడుకొన్నా నిద్ర పట్టడం లేదు గతాన్ని నెమరు వేసుకొంటూ భవిష్యత్తుపై బంగారు కలలు కంటూ మనసు దాని దారిలో అది అడ్డూ ఆపూ లేకుండా పోతూ ఉంది దాన్ని అదుపులోక తెచ్చుకొందామని సతమతమవుతూంటె ఉన్నట్లుండి హాహాకారాలు చెలరేగినాయి కరుణాకర్ ఎగిరిపడ లేచినాడు ఒక్క లగువులో బయటపడినాడు

కాటన్ మిల్స్ గొడౌన్ తగలబడి పోతూ ఉంది!

మంటలు ఆకాశాన్నంటుతున్నాయి పూరిగుడిసెల్లో పేదజనులు గుండెలు బాదుకొంటూ గుడిసెల్ని రక్షించుకోవాలని హడావిడిగా అటుయిటూ పరుగెత్తుతున్నారు

అంతవరకు అదృష్టం! గాలి మరొక దిశగా వీస్తూంటె మంటలు గుడిసెల జోలికి రాలేదు

అయితే కరుణాకర్ వేలం పాటలో కొన్న వేస్ట్ ఆ వేస్ట్‌తో కలిసి లారీ లోడు చిత్తు కాగితాలు – తన యింటి వాకిట్లో చోటు లేక గొడౌన్ గోడల కానించి నెట్టు కట్టిన చిత్తు కాగితాల బస్తాలు – కాలి పోతుంటె కరుణాకర్ గుండెలు కాలిపోతున్నాయి అయినా ఏం చేస్తాడు' నిలువు రాయిలా నిలబడి చూస్తున్నాడు

అదే సమయంలో ఎరేకండిషన్డ్ గదిలో కాటన్ మిల్స్ యజమాని పరశురామ్ ఎ హెచ్ బ్యాంకు గొడౌన్స్ సూపర్‌వైజర్ అర్జునరావు ఇన్సూరెన్స్ కంపెని మేనేజర్ కృష్ణారావు విందు వినోదాలు చేస్తూ విచ్చలవిడిగా ఉన్నారు

కాలుతున్న గొడౌన్ మంటలకు తన నవ్వుల్ని కలగలిపినట్లుగా కృష్ణారావు అయ్యో'అపదానిగారూ' అనుకొన్న ప్లాన్ ప్రకారం ఖాండవదహనం జరిగిపోయింది అర్జునరావు తన పాత్ర సమర్థవంతంగా నిర్వహించినారు రికార్డు అద్భుతంగా ఉంది మీ ఆకలి తప్పకుండా తీరిపోతుంది ఆ పూచి నాది సందేహించవలసిన పనేలేదు అయితే అలనాడు ఖాండవదహనంలో కృష్ణుడికి పారితోషికంగా పాంచజన్యం లభించింది మరి నాకో! కనీసం ఒక మారుతి కార్' అంటుంటే, గాండీవమంత అస్త్రాన్ని బహుమతిగా యిచ్చి నా నావిద్యలో నేను నిపుణుడనే కాని విలువిద్యలో కాదు కాబట్టి నాకొక డాల్ఫిన్ కారు చాలు' అని అంటున్నారు అర్జునరావు ఆకలి తీరిన అగ్నిహోత్రుడు అదే పరశురామ్ ఎ హెచ్ సహకరించిన ఫైర్ సర్వీసును కూడా సన్మానించాలి కదా? అని అంటుంటె ఆయన సహృదయతకు అర్జునరావు కృష్ణారావు చేతులెత్తి నమస్కరిస్తూ నవ్వుతూంటె బానసకుపులు లయబద్ధంగా ఆడుతున్నాయి'

ఇది నిజంగా ఖాండవదహనమే' ఈ దేశంలో ఇల్లాంటి దహనాలు జరుగుతూనే ఉంటాయి

కరుణాకర్ లాంటి సాదుజంతువులు కాలబూడిద అవుతూనే ఉంటారు' □

అంతర్జాతీయయువజన సంవత్సరంలో కూడా యువమేధస్సుకు తగిన ప్రోత్సాహం శ్రమకు తగిన ఫలితం, చదువుకి తగిన ఉద్యోగం పొందలేని కరుణాకర్ లాంటి అభాగ్య యువకులకు అంకితం కాదు కానీ కన్నీటి తుడుపు!

-రచయిత